క్లుప్తంగా

నేడు మండల సమావేశం

ఐరాల: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నేడు శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు ఎంపీపీ మోహన్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నాగరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, వైస్ ఎంపీపీలు, సర్పంచులు, జెడ్పీటీసీ సభ్యురాలు, కో–ఆప్షన్ మెంబర్ హాజరు కావాలని కోరారు. మండలస్థాయి అధికారులు తమ శాఖలకు సంబంధించిన నివేదికలతో తప్పనిసరిగా హాజరుకావాలని పేర్కొన్నారు.

ముళ్లపొదల తొలగింపు



ముళ్ల పొదలను తొలగిస్తున్న దృశ్యం

ఐరాల: నగరి రోడ్డుకు ఇరువైపుల ఉన్న ముళ్ల పొదలను గురువారం తొలగించారు. ఎస్‌ఐ నరసింహులు ఆధ్వర్యంలో ఆర్‌అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా దట్టంగా పెరిగిన పిచ్చి మొక్కలు, ముళ్లపొదలను తొలగించారు. ముళ్ల పొదలు ఏపుగా పెరగడంతో వాహనదారులకు ఎదురుగా వచ్చే వాహనాలు కనపడక ప్రమాదాలు జరిగే అవకాశం ఉండడంతో ముందు జాగ్రత్తగా ముళ్లపొదలను తొలగించారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

15న ఉచిత కంటి పరీక్షలు

చిత్తూరు కలెక్టరేట్: నగరంలోని గాంధీరోడ్డులోని లిటిల్ రోస్ పాఠశాలలో ఈనెల 15న ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు కరస్పాండెంట్ గోపాలకృష్ణమూర్తి తెలిపారు. ఈమేరకు గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బెంగళూరుకు చెందిన శంకర కంటి ఆస్పత్రి వైద్యుల ఆధ్వర్యంలో కంటి వైద్యపరీక్షలు, ఆపరేషన్‌లు నిర్వహిస్తారన్నారు. పరీక్షలకు వచ్చేవారు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు జిరాక్సులు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు తీసుకురావాలని కోరారు. వివరాలకు 9440266653 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

చిరుధాన్యాలలో పోషకాలు పుష్కలం



తీర్థంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ అధికారులు, ఆరోగ్య సిబ్బంది

బైరెడ్డిపల్లి: చిరుధాన్యాలలో విలువైన పోషకాలు పుష్కలంగా ఉన్నాయని హెల్త్ ఎడ్యుకేటర్ కాంతమ్మ అన్నారు. మండలంలోని తీర్థంలో గురువారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, రోగాల బారిన పడకుండా ప్రతి ఒక్కరూ పోషకాహారం తీసుకోవాలని కోరారు. తక్కువ ఖర్చుతో క్కువ పోషకాలు ఉన్న ఆకుకూరలు, కూరగాయలు క్రమం తప్పకుండా ఆహారంలో తీసుకోవాలన్నారు. చిరుధాన్యాల వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లత, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన స్కాట్స్ అండ్ గైడ్స్



మొక్కలను నాటుతున్న ఉపాధ్యాయులు

శాంతిపురం: మండలంలోని రాళ్లబూదుగూరు, సోగడబళ్ల ఉన్నత పాఠశాలలకు చెందిన స్కాట్ అండ్ గైడ్స్ శాంతిపురం–కేజీఎఫ్ మార్గంలో దాదాపు 200 మొక్కలను నాటారు. స్వచ్ఛ పక్వాడా కార్యక్రమంలో భాగంగా సోగడబళ్లలో వారు పరిసరాల పరిశుభ్రత, ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మానవులతో సహా భూమిపై జీవరాశులు మనుగడ సాగించాలంటే అందరూ విరివిగా మొక్కలను పెంచాలని చెప్పారు. కార్యక్రమంలో స్కాట్ మాస్టర్లు సిద్దారెడ్డి, ఈశ్వరయ్య, సోగడబళ్ల జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం శేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు అనర్థదాయకం

పాలసముద్రం: బాల్య వివాహాలతో అనర్థాలు సంభవించి తల్లీబిడ్డ ప్రాణాలకు నష్టం వాటిల్లే అవకాశాలున్నాయని వైద్యాధికారి మోహన్ క్రిష్ణ, ఎస్‌ఐ భారతి తెలిపారు. గురువారం పాలసముద్రం ప్రభుత్వం జూనియర్ కళాశాలల్లో బాల్యవివాహాలతో కలిగే అనర్థాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఎస్‌ఐ భారతి మాట్లాడుతూ గ్రామాల్లో బాల్య వివాహాలు చేస్తున్నట్లు తెలిస్తే చైల్డ్‌లైన్ 1098కు సమాచారం అందించాలన్నారు. బాలికలు ఏవైనా సమస్యలు ఎదుర్కొంటున్నా 100కు డయల్ చేసి సమాచారం అందించాలన్నారు. విద్యార్థినులకు బాలల హక్కులను తరవుగా వివరించారు. పీహెచ్‌సీ సూపర్‌వైజర్ మురళి మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు, వ్యక్తిగత పరిశుభ్రత, టీబీ, కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించారు. ఏఎస్‌ఐ మురుగేష్, మహిళా పోలీస్, ఆశా, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో

అధిక దిగుబడి



కోతల అనంతరం తోటలో ట్రాక్టర్‌తో లోతు దుక్కులు చేస్తున్న రైతు

- మామిడి తోటల్లో మూడుసార్లు లోతు దుక్కులు తీయాలి
- మొక్క వయసును బట్టి పోషకాలు అందించాలి
- చెట్టు చనిపోయిన స్థానంలో కొత్త అంట్లు వేయాలి
- జిల్లా ఉద్యానశాఖాధికారి మధుసూదన్‌రెడ్డి సూచనలు
- నియోజకవర్గంలో 65వేల ఎకరాల్లో మామిడి సేద్యం



ఐరాల: మామిడి తోటల కోతల అనంతరం యాజమాన్య పద్ధతుల్లో అంతర పంటల సాగు చేస్తే లాభదాయకమని, ఈదిశగా తోటల్లో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై ఉద్యానశాఖాధికారి మధుసూదన్‌రెడ్డి వివరాలు తెలిపారు. మామిడి తోటల్లో కాపు పూర్తయిన తర్వాత తొలకరి వర్షాలకు జూన్, జూలై నెలల్లో మొదటిసారి, ఆగస్టులో రెండోసారి, అక్టోబర్–నవంబర్ నెలల్లో మూడోసారి భూమిలో పదును చూసుకుని దుక్కు చేసుకోవాలి. మొదటి దుక్కుకి వర్షపు నీరు భూమిలోకి బాగా ఇంకిపోయి నేలకోతను అడ్డుకుంటుంది. రెండో దుక్కు కలుపు నివారణకు దోహదపడుతుంది. మూడో దుక్కు పూత రావడానికి దోహదపడుతుంది. నేలలో ఉండే పిండి పురుగులు, పండు ఈగల కోశస్థ దశలు నశిస్తాయి. దుక్కు సాలుకు అడ్డంగా దున్నాలి. తోటలో భూమి వాలును బట్టి ప్రతి 10–15 చెట్లకు చుట్టూ పెద్ద అడ్డ కట్టలు, తోట చుట్టూ గట్టు వేయాలి. దీనివల్ల వర్షపు నీరు, సహజ సత్తువ బయటకు కొట్టుకుపోదు. నేలలో తేమ బాగా ఉంటుంది.

సూక్ష్మ ధాతువులను అందించాలి..

మామిడి తోటలో పలురకాల సూక్ష్మ ధాతు లోపాలు కనిపిస్తుంటాయి. కాయలు కోయడం పూర్తయిన వెంటనే చెట్లు పుంజుకోవడానికి జింక్ సల్ఫేట్ 5 గ్రాములు, యూరియా 10 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఆ తర్వాత సూక్ష్మ దాతువు జింక్, మెగ్నీషియం, ఇనుము, బోరాన్, మాంగనీస్ మిశ్రమ ద్రావణాన్ని తయారు చేసి జూలై, ఆగస్టు నెలల్లో చెట్లు కొత్త ఆకు తొడిగే సమయంలో రెండవసారి పిచికారీ చేయాలి. జింక్ 5 గ్రాములు, మెగ్నీషియం 2 గ్రాములు, మాంగనీస సల్ఫేట్ 2 గ్రాములు, ఫెర్రస్ సల్ఫేట్ 2 గ్రాములు, బోరాన్ 2 గ్రాములు, సున్నం 6 గ్రాములు, యూరియా పది గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

కొత్త అంట్లు నాటాలి..

యాజమాన్య పద్ధతులు అనుసరించి తోటల్లో అక్కడక్కడ చెట్లు చనిపోయి ఖాళీలు ఏర్పడతాయి. ఈ ఖాళీల్లో మొక్క పెట్టేచోట మళ్లీ ఒక మీటరు పొడవు, మీటరు వెడల్పు, మీటరు లోతు సైజులో గుంతలు తీయాలి. గుంతలు తవ్వేటప్పుడు పై అరమీటరు లోతు మట్టిని ఒక పక్కకు, లోపలి అర మీటరు మట్టిని మరోవైపు వేర్వేరుగా కుప్పలు వేయాలి. పై మట్టికి 100 కిలోల పశువుల ఎరువు లేదా 30 కిలోల వర్మీకంపోస్టు, 2 కిలోల సూపర్ ఫాస్ఫేట్ కలపాలి. చెదలు ఆశించకుండా 100 గ్రాముల లిండేన్/ఫాలిడాన్ (5 శాతం) పొడి మందును మట్టి, ఎరువు మిశ్రమానికి కలపాలి. గుంతను మొదట ఈ మిశ్రమంతో నింపాలి. తక్కువైతే పక్కనున్న మట్టితో గుంత నింపుకుని మొక్క నాటే ముందు రోజు గుంతకు నీరు పెడితే పోత మన్ను బాగా కుంగుతుంది. గుంత మధ్య భాగంతో కొంచెం మట్టిని తీసి, అంటు వేర్లకున్న మట్టి కదలకుండా, రాలకుండా ముద్దలా ఉంచి మరికొంత మట్టిని చేర్చి కాంప్యాక్ చేయాలి. మట్టి వదులుగా ఉండరాదు. మొక్క చుట్టూ నీరు పోయాలి. నాటేటప్పుడు మామిడి అంటు కలయిక భూమిలో పూడ్చకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. నాటిన అంట్లు గాలుల తీవ్రతకు ఊగిపోకుండా మొక్కకు ఇరువైపులా చిన్న కర్రలు కట్టాలి. నాటిన తర్వాత మొక్క కాండం నిటారుగా ఉండాలి. మొక్క చుట్టూ నెలకొకసారి నేలను తవ్వి గుల్లపరుస్తూ ఉండాలి. కలుపు మొక్కలను ఎప్పటికప్పుడు తీసి వేస్తుండాలి. తోటల్లో చెట్ల మధ్య ఖాళీ స్థలం దున్నడం వల్ల నేల గుల్లబారి భౌతిక స్థితి మెరుగుపడుతుంది. నేలలో గాలి బాగా ప్రసరించి మొక్కకు మేలు చేస్తుంది. కలుపు మొక్కల బెడద ఉండదు. నీటికి, పోషకాల వినియోగానికి పోటీ ఉండదు. అంతేగాక నేలలోనే నివసించే హానికర పురుగుల నశిస్తాయి.

సమగ్ర ఎరువుల యాజమాన్యం

ముఖ్యంగా నత్రజని, భాస్వరం, పొటాష్ పోషకాల్ని సకాలంలో అధికారుల సూచనల మేరకు అవసరమైన మోతాదులో వేయాలి. వయసును బట్టి ఒక్కో చెట్టుకు ఒక సంవత్సరానికి ఏయే ఎరువులు ఎంత మోతాదులో వేయాలో క్షుణ్ణంగా తెలుసుకోవాలి. సంవత్సరం వయసు చెట్లకు పశువుల ఎరువు లేదంటే కంపోస్టు 10 కిలోలు, యూరియా 200 గ్రాములు, సూపర్ ఫాస్ఫేట్ 500 గ్రాములు, ఎంఓపీ 150 గ్రాముల వంతున వేసుకోవాలి. రెండేళ్ల చెట్లకు ఒక్కోదానికి పశువుల ఎరువు 20 కిలోలు, యూరియా 400 గ్రాములు, సూపర్ ఫాస్ఫేట్ 1000 గ్రాములు, ఎంఓపీ 750 గ్రాములు వాడాలి. ఐదేళ్ల వయసు చెట్లకు పశువుల ఎరువు చెట్లకు పశువుల ఎరువు 50 కిలోలు, యూరియా 1000 గ్రాములు, సూపర్ ఫాస్ఫేట్ 2,500 గ్రాములు, ఎంఓపీ 300 గ్రాములు వేయాలి. పదేళ్ల ఆపైన వయసున్న చెట్లకు ఒక్కోదానికి పశువుల ఎరువు 1000 గ్రాములు, యూరియా 2వేల గ్రాములు, సూపర్ ఫాస్ఫేట్ 500 గ్రాములు, ఎంఓపీ 1,500 గ్రాములు వేయాలి.

దుర్గాంబ ఆలయంలో దసరా ఉత్సవాలు

- అక్టోబర్ 3 నుంచి 13 వరకు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): నగరంలోని గిరింపేటలో వెలసిన శ్రీదుర్గాంబ ఆలయంలో అక్టోబర్ 3 నుంచి 13వ తేదీ వరకు దసరా నవరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ మునిశేఖర్ తెలిపారు. 3వ తేదీ మహాచండి హోమం, మహాలక్ష్మి అలంకారం ఉంటుందన్నారు. 4న చాముండేశ్వరిదేవి, 5న శ్రీలలితాదేవి, 6న శ్రీపార్వతిదేవి, 7న శ్రీకాత్యాయనిదేవి, 8న సరస్వతిదేవి, 9న శ్రీ మహిషాసురమర్ధిని, 10న శ్రీరాజరాజేశ్వరిదేవి అలంకారం, 12న దుర్గాదేవి పవళింపు సేవ, 12న శ్రీపుష్పరథంలో శ్రీవిజయలక్ష్మీదేవి అలంకారం ఉంటుందన్నారు. 13వ తేదీ వసంతోత్సవంతో నవరాత్రి ఉత్సవాలు ముగుస్తాయని ఆయన పేర్కొన్నారు.

ట్రాన్స్‌కో డీఈగా ఆనంద్



బాధ్యతలు స్వీకరిస్తున్న డీఈ ఆనంద్

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో రూరల్–3 సబ్‌డివిజన్ డీఈగా ఆనంద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న డీఈ పద్మనాభ పిళ్లై బాధ్యతలను అప్పగించారు. తొలుత ఈఈ మునిచంద్రను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా డీఈలు శేషాద్రి, జ్ఞానేశ్వర్, జయప్రకాష్, కొండయ్య, సుబ్రమణ్యం, హరి, బాబు, ఏఈలు, సబ్‌ఇంజినీర్లు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. విద్యుత్ ఉద్యోగుల సంఘాల నాయకులు గోవిందరాజులు, గోవిందన్, చంద్రమౌళిపిళ్లై, యజ్ఞేశ్వరరావు, విద్యాసాగర్, కుమార్ కలసి శుభాకాంక్షలు తెలిపారు. వినియోగదారుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని డీఈ వివరించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



కవాతు నిర్వహిస్తున్న సీఐ, సిబ్బంది

బంగారుపాళెం: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలని అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్ సీఐ కత్తి శ్రీనివాసులు సూచించారు. గురువారం సాయంత్రం పట్టణంలో పోలీసు కవాతు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ వాహనదారులు ట్రాఫిక్ ఆంక్షలకు అనుసరించి వాహనాలు నడపాలన్నారు. మండల కేంద్రంలో దుకాణాల ముందు అస్తవ్యస్తంగా వాహనాలు పార్కింగ్ చేయరాదన్నారు. మద్యం తాగి వాహనాలు నడపరాదన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ రామచంద్రారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి

బంగారుపాళెం: మండలంలోని తిమ్మోజుపల్లెకు చెందిన ఉపాధి కూలీ గురువారం గుండెపోటుతో మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. దళితవాడకు చెందిన గోవిందయ్య, భార్య జ్ఞానసుందరి ఇద్దరు వజ్రాలపురం వద్ద ఉపాధి పథకం కింద ట్రెంచ్ పనులు చేసేందుకు వెళ్లారు. మధ్యాహ్నం పనులు ముగించుకుని ఇంటికి రాగానే జ్ఞానసుందరి(55) ఛాతిలో నొప్పిగా ఉందని చెప్పడంతో ఆస్పత్రికి తరలించారు. నొప్పి ఎక్కువ కావడంతో తిరుపతికి తరలిస్తుండగా ఆమె మృతిచెందినట్లు వారు తెలిపారు.

ప్లాస్టిక్‌ను నిషేధించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు

తవణంపల్లె: పర్యావరణం పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని ఇందులో అందరూ భాగస్వాములు కావాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రియాంక పిలుపునిచ్చారు. గురువారం అరగొండలో పర్యావరణంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కాలుష్యాన్ని నిర్మూలించు, పర్యావరణాన్ని కాపాడు, ప్లాస్టిక్ వాడకం పర్యావరణానికి ముప్పు, చెట్లే ప్రగతికి మెట్లు– చెట్లు నరికితే ఇక్కట్లు, ఇంధనం వాడకం తగ్గించు– ప్రకృతి కాలుష్యం తగ్గించు, మొక్కలు నాటండి పర్యావరణాన్ని రక్షించండి అనే నినాదాలతో అరగొండ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కాలుష్య రహిత రాష్ట్రం కోసం ప్రతిఒక్కరూ పాటుపడదామని భవిష్యత్తు తరాల బాగుకోసం ఆకుపచ్చని ఆంధ్రప్రదేశ్‌ను నిర్మిద్దామని కోరారు. ర్యాలీలో వైద్యాధికారులు మోహన్‌వేలు, వినయ్‌కుమార్, ఆరోగ్య పర్యవేక్షకులు రెడ్డెమ్మ, రాజశేఖర్, హెల్త్ అసిస్టెంట్ సుబ్రమణ్యంరెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, అరగొండ అపోలో నర్సింగ్ కాలేజ్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పీవీకేఎన్‌లో కంప్యూటర్ ల్యాబ్

చిత్తూరు కలెక్టరేట్: ఉన్నత విద్యనభ్యసించే విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ అన్నారు. గురువారం నగరంలోని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రణాళిక, అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పీవీకేఎన్ కళాశాల అభివృద్ధికి ప్రభుత్వం తరఫున అవసరమైన చర్యలు చేపడతానన్నారు. అనంతరం కళాశాలలో కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించారు. ప్రిన్సిపల్ డా.జీవనజ్యోతి, పూర్వ విద్యార్థుల కమిటీ సెక్రటరీ రామకృష్ణ, వైస్ ప్రిన్సిపల్ మీరా సాహెబ్, సభ్యులు చంద్రశేఖర్, చెన్నకేశవులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న డీపీఎంఓ దేవదాస్

సదుం: కుష్టు వ్యాధిపై విద్యార్థులకు డీపీఎంఓ దేవదాస్ గురువారం అవగాహన కల్పించారు. ఎంజేపీ గురుకుల పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కాలేజీలో కార్యక్రమం ఏర్పాటు చేశారు. కుష్టు వ్యాధికి భయపడాల్సిన పనిలేదని చెప్పారు. వంశపారం పర్యంగా ఈ వ్యాధి సంక్రమించదన్నారు. కుష్టు వ్యాధి లక్షణాలు, వ్యాధి నిర్ధారణ, చికిత్సా విధానం గురించి తెలియజేశారు. ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి, ఎంపీహెచ్‌ఈఓ ఉదయభాస్కర్, ఎంఎల్‌హెచ్‌పీ జోసెఫ్ పాల్గొన్నారు.

వినాయకుని సేవలో మాజీ కేంద్రమంత్రి

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామిని గురువారం మాజీ కేంద్ర మంత్రి కిల్లి కృపారాణి దర్శించుకున్నారు. కుటుంబసమేతంగా ఆమె స్వామివారి సేవకు రాగా ఆలయ అధికారులు వారికి పూర్ణకుంభ స్వాగతం పలికి స్వామి దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వచన మండపంలో అర్చకులు ఆశీర్వచనాలు అందజేసి స్వామి ప్రసాదం, చిత్రపటం అందజేశారు. సిబ్బంది వాసు, విగ్నేష్ పాల్గొన్నారు.

యూరియా ద్రావణం పిచికారీ చేయాలి



పొలంబడి కార్యక్రమం నిర్వహిస్తున్న ఏడీ ఉమ

తవణంపల్లె: వర్షాభావ పరిస్థితులు వల్ల వాడుతున్న వేరుశనగ పంటకు రైతులు యూరియా ద్రావణం పిచికారీ చేసి కాపాడుకోవాలని వ్యవసాయ శాఖ ఏడీ ఉమ సూచించారు. గురువారం మండలంలోని టి.పుత్తూరులో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఏడీ మాట్లాడుతూ వర్షాభావం వల్ల ఎండుతున్న వేరుశనగ పంటకు నీటి వసతి ఉన్న రైతులు నీటి తడులు ఇవ్వాలని సూచించారు. వేరుశనగలో తెగుళ్లను అరికట్టేందుకు పొలం చుట్టూ జొన్న, మొక్కజొన్న, ఆముదం పంటలను వేయడం ద్వారా రసం పీల్చే పురుగులను నివారించవచ్చని పేర్కొన్నారు. వాడుతున్న వేరుశనగ పంటకు ఎకరాకు లీటరు నీటిలో 20 గ్రాముల యూరియా కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఏఓ ప్రవీణ్, వీహెచ్‌ఏ శ్రీధర్, సేంద్రియ వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

కణ్ణన్ పాఠశాల అభివృద్ధికి కృషి

- ఘనంగా కణ్ణన్ 97వ జయంతి వేడుకలు



విద్యార్థులకు సైకిళ్లను అందజేస్తున్న ఎమ్మెల్యే గురజాల, మేయర్ అముద

చిత్తూరు కలెక్టరేట్: నగరంలోని కణ్ణన్ ప్రభుత్వ పాఠశాల, జూనియర్ కళాశాల అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ హామీ ఇచ్చారు. గురువారం నగరంలోని కణ్ణన్ పాఠశాలలో కణ్ణన్ 97వ జయంతి, పాఠశాల 77వ వార్షికోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ కణ్ణన్ జ్ఞాపకార్థం ఆయన తండ్రి వందల ఎకరాల భూమిని ప్రభుత్వ పాఠశాల కోసం ఉచితంగా అందజేశారన్నారు. ఎంతో పేరు ఉన్న కణ్ణన్ ప్రభుత్వ పాఠశాల, కళాశాలకు పూర్వవైభవం తీసుకొచ్చేందుకు చర్యలు చేపడుతామన్నారు. మేయర్ అముద మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు విలువలను నేర్పించాలన్నారు. అనంతరం పలువురు విద్యార్థులకు ఉచితంగా 12 సైకిళ్లను అందజేశారు. మాజీ మేయర్ హేమలత, ఇంటర్మీడియట్ డీవీఈఓ సయ్యద్ మౌలా, హెచ్ఎం తులసిబాబు, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పూల సుబ్రహ్మణ్యం, మునిరత్నం, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవం.. బ్రహ్మోత్సవం







వరసిద్ధి వినాయకస్వామి బ్రహ్మోత్సవాలు ఆరో రోజు గురువారం ఉత్సవ మూర్తులకు ఆలయ అర్చకులు క్షీరాభిషేకం చేసి పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ ఆస్థాన మండపంలో కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ హాజరై కళాకారులను సత్కరించి ప్రశంసాపత్రాలను అందజేశారు.

–కాణిపాకం





సీజనల్ వ్యాధులపై అప్రమత్తం





తెల్లగుండ్లపల్లెలో గర్భిణిని పరీక్షిస్తున్న డాక్టర్ కేశవనారాయణ, 189కొత్తపల్లెలో..

తవణంపల్లె: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారులు వినయ్‌కుమార్, కేశవ నారాయణ వైద్య సిబ్బందికి సూచించారు. గురువారం మండలంలోని తెల్లగుండ్లపల్లె, ఉప్పాంకలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో 65 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం గర్భవతులు, బాలింతలకు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. వైద్యసిబ్బంది, ఆరోగ్య పర్యవేక్షకులు, హెల్త్ సూపర్‌వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

189కొత్తపల్లెలో ఫ్యామిలీ డాక్టర్

గుడిపాల: 189కొత్తపల్లె గ్రామంలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ చంద్రమహేష్ 62 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఉచితంగా మందులను పంపిణీ చేశారు. గర్భవతులు, బీపీ, మధుమేహ వ్యాధి గ్రస్తులకు పరీక్షలు నిర్వహించి తగు సూచనలను ఇచ్చారు. ఇంటి వద్ద మంచానికి గురైన రోగుల వద్దకు వెళ్లివైద్యపరీక్షలు చేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది విజయ, చంద్రశేఖర్, సునీత, అనిత, ప్రవీణ్, భాగ్యవతి పాల్గొన్నారు.

పంటలపై ఏనుగుల దాడి



ఏనుగులు ధ్వంసం చేసిన బీర పంట

పెద్దపంజాణి: మండలంలో కోగిలేరు సమీపంలోని పంటలను బుధవారం రాత్రి ఏనుగులు ధ్వంసం చేశాయి. గంగవరం మండలం కల్లుపల్లెకు చెందిన శంకరయ్య, క్రిష్ణా రెడ్డి సాగు చేసిన దోస, బీర, వరి పంటలను తొక్కి నాశనం చేశాయి. కొబ్బరి చెట్లను విరిచేశాయి. గురువారం ఉదయం పొలాల వద్దకు వెళ్లిన రైతులు పంట నష్టాన్ని చూసి కన్నీటి పర్యంతమయ్యారు. సమాచారం అందుకున్న రాయలపేట ఫారెస్టు బీట్ ఆఫీసర్ రవికుమార్ పంట నష్టాన్ని పరిశీలించారు. వివరాలను ఉన్నతాధికారులకు పంపిస్తామని తెలిపారు. ట్రాకర్ల సాయంతో ఏనుగులను అడవిలోకి మళ్లించేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు.